ఆదివారం కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ముక్కుపుడక

పొడిచే పొద్దుకు వాలేపొద్దుకు ఎంతోకాలం గడవాలన్నట్లుగా రోజులు భారంగా నెట్టుకొస్తున్న సత్తెమ్మకు ఇప్పుడు కాలం తెలీకుండా గడిచి పోతున్నట్లుగా, రోజంతా ఇట్టే గిర్రున తిరిగి పోతున్నట్లుగా ఆశ్చర్యంగా వుంది.

కొడుక్కి పెళ్ళయిన ఎన్నోయేళ్ళకు లేకలేక ఒక మగబిడ్డ పుట్టేసరికి, వాడిపోతున్న మొక్కకు నీటి జాలు సోకి జీవం పోసుకొన్నట్లుగా బ్రతుకుమీద విరక్తి పెంచుకొన్న సత్తెమ్మ మనస్సు తిరిగి చిగురించింది.

మనవడు పుట్టగానే చూడటానికి వచ్చిన వాళ్ళంతా వాడి అందచందాలు పొగుడుతుంటే విన్న సత్తెమ్మ మనసు సంతోషంతో పరవళ్ళు తొక్కింది.

"సత్తెమ్మా! నీ మనవడు దబ్బపండులా చక్కంగున్నాడు.

ఏమారాజు ఇంటనో పుట్టాల్సినోడు." అని సుబ్బమ్మ అంటుంటే గర్వపడింది.

"పుటకంతా ఆ ముసలాడిదేనే! ముక్కూ, ముఖం సూత్తా వుంటే సెంద్రయ్యే నీ కోడలి కడుపున పుట్టినట్టుంది." పోలమ్మ మాటలకు చచ్చిపోయిన మొగుడు చంద్రయ్య గుర్తొచ్చి ముసి ముసిగా నవ్వుకొంది.

"సత్తెమ్మా! నీ మనవడు చుక్కలాగ మెరిసిపోతన్నాడు. పసోడయినా ఎంత జుట్టుందో యీడికి. కుడికంట్లో పుట్టుమచ్చుంటే ఎంత అదురుట్టమో!" పసిగుడ్డును ముద్దులాడుతూ సుబ్బమ్మ అంటుంటే వాడి భవిష్యత్తును గురించి ఊహల్లో తేలిపోయింది.

అందరూ ఎంతగానో పొగుడుతున్న మనవడి రూపాన్ని తృప్తిదీరా చూసుకోవాలన్న తాపత్రయంతో మంచం దగ్గరగా నడిచి కళ్ళింత జేసుకొని తేరిపార జూసింది. ముసిలితనంలో కళ్ళు తెల్ల పొరలు కమ్మటంతో చీకట్లో నీడలా కదులాడుతున్న మనవడి ఆకారాన్ని లీలగాతప్ప స్పష్టంగా చూసుకోలేక ఉసూరుమంది.

వాడ్ని కళ్ళారా చూసుకోలేని తన దురదృష్టాన్ని మనసులోనే తిట్టుకుంటూ ఉండబట్టలేక మనవడ్ని ప్రేమగా చేత్తో తడిమి ముద్దులాడ బోయింది.

"అత్తా! నీవసలే గుడ్డిదానివి. అగపడక అడి కళ్ళల్లో పొడిచేవ్!" అంటూ కోడలు చిన్నమ్మ సత్తెమ్మ చేతుల్ని ప్రక్కకు తోసేసరికి మనసు చివుక్కుమంది.

వాడ్ని వడిలోకి తీసుకోవాలని మనసు ఎంతగా తహతహ

లాడుతున్నా కోడలు తిడుతుందన్న భయంతో దూరంగానే నిలబడి పోయేది.

"భగవంతుడా! ఇంత ఎలుగున్న సేంద్రుడొచ్చి చూడ్డానికి నాకు కళ్లులేకుండా చేసినావా?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఒరే వెంకటయ్యా! మీ అయ్యే పుట్టాడ్రా! ఆడి పోలిక లన్నీ మీ అయ్యవేనని అంతా చెప్తున్నారు." గొప్పగా చెప్పుకుంది కొడుక్కి.

బొద్దుగా అందంగా ఉన్న కొడుకుని చూసుకుని వెంకటయ్య కూడా సంతోషపడ్డాడు. "ఈడిదంతా అయ్య పుటకేనే! జమాసులా అయ్యంతవుతాడు." కొడుకు ముద్దులాడుతుంటే సత్తెమ్మ పొంగి పోయింది.

రోజంతా గుడిసెలో ఏదో మూల పడుకుని వేళకింత ముద్ద తింటూ చావెప్పుడొస్తుందని ఎదురుచూసే సత్తెమ్మ మనవడిరాకతో పూర్తిగా మారిపోయింది. ఏదోశక్తి ఆవహించినట్లుగా ముసలితనం మర్చిపోయింది. మనవడి ప్రతి కదలికను గమనిస్తూ బాహ్య ప్రపంచాన్నే మర్చిపోతుంది.

వాడు కేరుమని ఏడిస్తేచాలు, "చిన్నమ్మా! నా బంగారు కొండకి ఆకలైనట్టుంది చూడవే- కడుపు నిండా పాలట్టు." అంటూ కోడల్ని కేకలేస్తుంది.

ఏమాత్రం అవకాశం దొరికినా మెల్లగా వాడి దగ్గరకు చేరి ఒడిలోకి తీసుకొని ముద్దులాడాలని ఆరాటపడుతుంది. ఆది గమ నించిన చిన్నమ్మ అత్తమీద విరుచుకు పడుతుంది.

"అత్తమ్మా ! వాడ్నంటుకోకు. దూరంగావుండు. నీ కసలే చూపు అగుపించదు." అంటూ సత్తెమ్మను దూరంగా తోసేస్తుంటే మనసు తల్లడిల్లిపోతుంది.

తనకు చూపు కనిపించదన్న వంకతో మనవడ్ని తనకు కాకుండా చేస్తుందన్న కోపంతో చిన్నమ్మను మనసులోనే తిట్టి పోస్తుంది. "నాకు చూపగ పడక పోతేనేం ! నా బంగారు కొండకు కూసింతయినా బాధ కలిగిస్తానా ? ఆడు నాపేనవే." అంటూ గొణుక్కుంటుంది.

పదకొండవ రోజున మనవడికి ఏం పేరు పెట్టాలని కొడుకు, కోడలూ వాదులాడు కొంటుంటే తన కిష్టమైన పేరు పెట్టరేమోనని ఆందోళన పడింది.

"మావా ! ఈడికి మాతాత యీరయ్య పేరెడదాం. చక్కగా వుంటది. మా తాతకు నేనంటే ఎంతో పేమ." చిన్నమ్మ పంతం పట్టింది.

వెంకటయ్య అందుకిష్టపడలేదు. అంతకన్నా మంచి పేరు కొడుక్కి పెట్టుకోవాలని ఉబలాట పడ్డాడు. కాసేపు ఇద్దరూ కీచులాడు కొన్నారు.

"ఒరే! ఈడు సుక్కల్లో సెందురూడు. ఈడికి తగ్గ పేరెడితేనే అందంగుంటది. ఈడు ఈ ఇంటికే ఎలుగురా." మనసులో మొగుడి పేరు పెట్టుకోవాలని వున్నా ఆ మాటలంటే చిన్నమ్మకి కోపం వస్తుందన్న భయంతో సూటిగా అనలేక పోయింది సత్తెమ్మ.

"నిజంగా ఈడు సెందురుడేనే ! ఆ పేరే ఎట్టాలి ఈడికి.

మా అమ్మ పేరుకూడా సెంద్రయ్యే గనక ఆ పేరే ఎడదాం ?"
అంటూ గొడవ చేశాడు వెంకటయ్య.

అదంటే ఇదని, ఇదంటే అదని ఇద్దరూ క్రిందా మీద పడి చివరకు ఒక రాజీ కొచ్చారు. ఈసారి ఆడపిల్ల పుడితే వీరమ్మని, మగవాడయితే వీరయ్యని పేర్లు పెట్టేటట్లుగా వెంకటయ్య ఒప్పు కొన్నాకనే చిన్నమ్మ చంద్రయ్యని పేరుపెట్టడానికి అంగీకరించింది.

మనవడికి తన మొగుడి పేరే పెట్టడంతో మనవడి మీద సత్తెమ్మకు ప్రేమ రెండింతలయింది. ఎంతగానో మురిసిపోయింది. "ఒరేయి కొండా! నీకు మీ తాత పేరే ఎట్టినార్రా! సెంద్రయ్య! నా సెంద్రయ్య! నువ్వు నిజంగా సెంద్రుడివేరా ?" అంటూ రోజంతా ముద్దులాడింది సత్తెమ్మ.

* * *

మనవడి ధ్యాసలో నెలలు రోజుల్లా గడిచి పోతున్నాయి సత్తెమ్మకు. తన వయసును మర్చిపోయి పసిదానిలా చంద్రయ్యతో వూసులాడుతుంది.

వాడు కేరింతలు కొడుతూ అల్లరిచేస్తుంటే సత్తెమ్మ మనసు ఆనందంతో పరవశ్ళు తొక్కుతుంది. "ఏంటమ్మా, సెంద్రయ్యా! అల్లరి సేత్తన్నావేటిరా! ఏం కావాలి?" అంటూ బుజ్జగిస్తుంది.

నెలలుగడిచేకొద్ది చంద్రయ్య పొట్టమీద అటూఇటూ దేకుతూ, "ఊఁ! ఆఁ! ఉంగా! ఇంగా!" అంటూ అస్పష్టంగా ధ్వనులు చేస్తుంటే, తనతో ఏదో చెప్తున్నట్లుగా వాడితో కబుర్లు చెపుతుంది.

చంద్రయ్యను వదలి ఒక్క నిమిషం కూడా బయటకు

వెళ్ళదు. రేయింబవళ్ళు మనవడి ధ్యాసే. చేతులు చరుస్తూ, గిన్నెలు చప్పుడు చేస్తూ, నోటితో చిత్రంగా ధ్వనులు చేస్తూ వాడు నవ్వుతుంటే అంతులేని ఆనందం సత్తెమ్మకు.

"అత్తమ్మా! వాడికన్నా నీ గొడవ ఎక్కువయింది. అట్టా కేకలేత్తావుంటే దడుసు కొంటాడు. సూత్తా కూకోలేవూ?" చిన్నమ్మ విసుక్కుంటుంది.

చంద్రయ్యని ఎత్తుకొని బయట తిప్పాలని, తన మనవడంటూ గొప్పగా చూపెట్టాలని, అందరూ మెచ్చుకోవాలని సత్తెమ్మ కోరిక. మనవడితో తనూ చిన్నపిల్లలా ఆటలాడుకోవాలని ఒక కేటఉబలాటం. కాని చిన్నమ్మ అందుకు అవకాశం ఇవ్వకుండా సత్తెమ్మను దూరంగా వుంచుతుంది. కళ్ళు సరిగా కనిపించక కొడుకును ఎక్కడ పడేస్తుందోనని చిన్నమ్మ భయం.

చిన్నమ్మ వంట పనిలోనో, మరేదన్నా పనిలోనో మునిగి వుండటం గమనిస్తే చాలు దొంగలా చంద్రయ్య దగ్గరకెళ్ళి వాడ్ని ఒడిలోకి తీసుకొని, "నా వరాలకొండా! సెంద్రీ! నేనురా! నీ అవ్వను. నవ్వు! నవ్వురా! నువ్వు నవ్వితే వరాలు రాల్తాయి! ఛీ! ఛ!" అంటూ వాడ్ని చక్కలిగింతలు పెట్టేసేది.

నాలుగైదు సార్లు సత్తెమ్మనలా చూసిన చిన్నమ్మ తగువేసుకొంది. "అత్తమ్మా! వాడ్నంటుకోవద్దని నీకాడు సెప్తుంట. దూరంగా కూచుని ఆడంచలేవు?" అంటూ విసురుకొని కొడుకును

చేతిలోనుండి లాగేసు కెళుతుంటే సత్తెమ్మకు దుఃఖం ముంచు కొచ్చింది.

"ఓరి భగవంతుడా! నన్నెందుకిట్టా శిచ్చిత్తన్నావ్ ! నేనేం పాపం చేశాను ?" వాపోయింది సత్తెమ్మ.

చిన్నమ్మ తిడుతుందన్న భయంవున్నా మనవడికి దూరంగా వుండలేక పోతుంది సత్తెమ్మ. హుషారుగా వాడు దేకుతూ, చేతులతో తపతప కొడుతూ, కేరింతలతో గుడిసెగిరేలా అల్లరి చేస్తుంటే సత్తెమ్మకు కవ్విస్తున్నట్లుంటుంది. తనకు చూపులేనందుకు విచారంలో మునిగిపోయింది.

"సత్తెమ్మా! నీకు కళ్ళు బొత్తిగా అగుపించటంలేదల్లే వుంది. బస్తీలో ఆపరేసను చేత్తారంట. చేయించుకో పోయినావా !" ఆవిలోగడ ఒకటి రెండుసార్లు తెలిసిన వాళ్ళంటే కొట్టి పారేసింది.

"ఏటే ! నేనాపరేసను చేయించుకొని చూపొత్తే మాత్రం ఇంకా నేనేం వూరులేలాల్నా, వుద్యోగాలు చెయ్యాల్నా! ఈ బతుక్కి అదొక్కటే తక్కువైవాదా?" అంటూ విరాగిలా మాట్లాడే సత్తెమ్మ ఇప్పుడు తనకు చూపొస్తే ఎంతో బావుండునని రోజూఅనుకొంటుంది.

చిన్నమ్మ భయంతో కొన్నాళ్ళు దూరంగావున్నా, ఓ రోజు నిగ్రహించుకోలేక పోయింది. కొడుకు ఇంట్లో వున్నాడు గనుక చిన్నమ్మ ఏమీ అనదన్న ధైర్యంతో చంద్రయ్యను ఎత్తుకొని ఆడించ సాగింది. చిన్నమ్మ సుడిగాలిలా వచ్చి కొడుకుని లాక్కొని వెంకటయ్య వినేలా చివాట్లు పెట్టింది.

"అమ్మా ! అది వద్దంటున్నా యినకుండా తిట్లు తింటా

వేసే! ఓ మూలగా కూచుని వుండరాదూ!" అని వెంకటయ్యే వత్తాసు పలికే సరికి, ఈడికి తల్లికన్నా పెళ్ళామే ఎల్లమయిందని ఉడుక్కు పోయింది.

"ఒరే! కంటికి ఐస్పిటల్లో ఆపరేసను చేత్తారంటగదా! నాకు ఆపరేసను చేయించరా!" ఓ రోజు అడిగింది కొడుకును.

"అమ్మోయమ్మ! నీబతుక్కి ఇప్పుడదొక్కటే తక్కువైనాదేటి? ఏళకింత ముద్దేస్తుంటే తిని ఓ చోట కూకోలేవూ?" కసిరాడు.

"అదికాదొరే! ఇలా గుడ్డి బతుకు బతకటం చానా కష్టంగుంది. నీకు పుణ్యముంటదిరా. ఒకప్పుడు పెపంచాన్నంతా చూసిన కళ్ళతో ఇప్పుడు చీకట్లో తిరగాల్నంటే బాధగా వుందిరా." సనిగింది.

"ఏటే! నువ్వింకా కొత్తగా చూడాల్సిన పెపంచకం ఏటంటా? గుట్టలు, పుట్టలు, చెట్లు, సూరీడు, సెంద్రుడు - నువ్వెరగనిదేం వుంది? పుట్టినప్పట్నుంచి చూత్తనే వున్నావుగా?"

"ఒరే ఎంకటయ్యా నాకు చూపున్నంతకాలం ఆటి యిలువ నాకు తెలీదురా! ఇప్పుడు నే చూడాలనుకొంటున్న సెంద్రుడి యిలువ నీకీ వయసున తెలీదు - నే చూడాలను కొంటున్న నా సెంద్రుడు ఆ సూరిడుకే ఎలుగురా." అంది సత్తెమ్మ.

"ఏందే నీ వెధవ్వాగుడు. ఆపరేసనంటే మాటలను కొన్నావేటే. దబ్బుకావాల, యాడుంది నాకాడ. నోర్మూసుకు పడుండు." అంటూ విసురుగా అవతలి కెళ్ళాడు వెంకటయ్య.

కొడుకు ఆపరేషన్‌కు అయ్యే ఖర్చుకోసమే వెనకాడుతున్నాడనుకొన్న సత్తెమ్మ మనసులో ఒక ఆలోచన తటాలున మెరిసి,

కొడుకు కోపం జూసి అంతలోనే ఆగిపోయింది.

"నా సెంద్రయ్యా! నీ ఎలుగు చూసుకోలేని గుడ్డిదాన్ని. నా బతుకంతా చీకట్నే వుంచుతావా? నువ్వయినా అవ్వకు చూపియ్యవా?" కళ్ళొత్తుకుంటూ ఏడ్చింది సత్తెమ్మ.

ఓ పండక్కి వెంకటయ్య చంద్రయ్యకు కొత్తలాగు చొక్కా కొనుక్కొచ్చి తొడిగాడు. కొత్త బట్టల్లో మెరిసి పోతున్న కొడుకును తనివితీరా ముద్దులాడి బయటకు వెళ్ళి పోయాడు. మనవడ్ని ఓసారి ఎత్తుకుని తనూ ముద్దులాడాలని కొడుకుని అడగాలనిపించినా బలవంతాన కోరికను అణిచేసుకుంది.

మనవడు నేలమీద హుషారుగా దేకుతూ అల్లరి చేస్తుంటే ఉత్తినే చూస్తూ కూర్చోవటానికి సత్తెమ్మ మనసు విలవిలలాడింది. కొత్త బట్టల్లో మనవడ్ని నలుగురికీ చూపెట్టాలన్న తాపత్రయంతో మనసు కొట్టుకు లాడుతుంది.

మెల్లగా వాడి దగ్గరకు చేరింది. అప్పుడే చిన్నమ్మ బట్టలుతకటానికి పెరట్లోకి వెళ్ళడంతో కాసేపు లోపలకు రాదన్న ధైర్యంతో మనవడ్ని చంకనేసుకొని బయటకు నడిచింది.

చంద్రయ్య సత్తెమ్మ చింపిరి జుట్టును గుప్పిళ్ళతో పట్టి కేరింతలు కొడ్తూ ఎగిరి పడ్తుంటే తెగ సంబరపడి పోయింది.

"నా సెంద్రీ! నాకు చూపు అగపడక పోయినా నిన్ను ఏడేత్తాసట్రా. నీ పేనానికి నా పేనం అడ్డెయ్యనూ! నిన్ను నాకు కాకుండా చేత్తన్నార్రా? నేనెంత మంచిదాన్నో నీకు పెద్దయ్యాక తెలుత్తదిలే" మనవడితో కబుర్లాడుతూ వీధిలోకి నడిచింది.

సత్తెమ్మ ఊహకన్నా ముందే పెరట్లో నుండి యివతలకు వచ్చిన చిన్నమ్మ ఆ దృశ్యం చూసి ఒక్క గావుకేక పెట్టింది. "ఓలమ్మో! దీనికేం పొయ్యేకాలం వచ్చినాది. బిడ్డనెత్తుకు పీధిన బడింది." అంటూ అటుకేసి పరిగెత్తబోయింది.

చిన్నమ్మ గావుకేకలకు సత్తెమ్మ కంగారు పడిపోయింది. భయంతో వెనుదిరిగి గబగబా వెనక్కురాబోయింది. ఆ తత్తరలో కాలు రాయికి తగిలి దభేలుమని తూలి కూలబడింది. ఆ విసురుకు చంద్రయ్య చేతిలో నుండి జారి క్రిందపడ్డాడు. దాంతో వాడు బెదిరి పోయి గుక్కపట్టాడు.

సత్తెమ్మ పై ప్రాణాలు పైనే పొయ్యాయి.

"ఓర్నాయనో! ఈ ముసలిముండ బిడ్డ పేనాలు తీసేసింది. దీనికీ గత్తరపుట్ట. చేతులు పడిపోను." నోటికొచ్చినట్టు తిడుతూ బిడ్డను ఎత్తుకొని శోకాలు పెట్టినంత పనిచేసింది.

చంద్రయ్య తల బాగానే బొప్పికట్టింది. ఆ బాధకి వాడు చాలా సేపు ఏడుస్తుండిపోయాడు. చిన్నమ్మ కోపం తారాస్థాయినందుకుంది. సత్తెమ్మకు కడుపుమంట చల్లారేదాకా తిట్టిపోసింది.

సత్తెమ్మను చిన్నమ్మ తిట్టేతిట్లకన్నా తనవలన మనవడికి దెబ్బతగిలినందుకే విలవిలలాడింది. తిట్లన్నీ భరిస్తూ మూగగా రోదించింది. సాయంత్రం వెంకటయ్య రాగానే జరిగినదంతా చెప్పి, కొడుక్కి తలమీద కట్టిన బొప్పి చూపెట్టేసరికి మండిపడ్డాడు.

"ముసలిముండవు వాడిజోలికెళ్లొద్దని నీకు ఎన్నిసారులు సెప్పినా బుద్ధిలేదే! ఈ తూరి వాడ్నంటుకున్నావంటే కాళ్ళు

ఇరగ్గొట్టి వీధిలోకి గెంటుతాను." వెంకటయ్య సత్తెమ్మను తిట్టి తన్నబోయాడు.

తప్పు తనదయినందుకు సత్తెమ్మ అన్నిటినీ మౌనంగా భరించింది. ఆ రోజంతా కూడు, నీళ్ళు ముట్టకుండా తనకు తానే శిక్ష విధించుకుంది.

రోజులు గడిచేకొలది సత్తెమ్మ దిగులుతో కృంగిపోతుంది. మనవడికేసి వెళ్తేనే కొడుకు ఎక్కడ తన్ని తగిలేస్తాడోనన్న భయంతో మనసును చంపుకొంటుంది. గుండెలో నిరాశ కొండలా పెరుగుతుంటే పిచ్చిదానిలా తనలో తానే గొణుక్కొంటుంది.

కొడుకు, కోడలు సత్తెమ్మ గాలి కూడా కొడుక్కి సోక నివ్వటంలేదు.

ఓనాడు-పట్నంలో వుంటున్న సత్తెమ్మ చెల్లెలి కూతురు సీతమ్మ, అల్లుడు చెన్నయ్య చుట్టంచూపుగా వచ్చారు. చెన్నయ్య పట్నంలోనే ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తుంటాడు. వాళ్ళ రాక సత్తెమ్మకు ఎంతో ఆనందం కలిగించింది. సీతమ్మకు సత్తెమ్మంటే ఎంతో ప్రాణం.

వాళ్ళున్న రెండు రోజులు మనవడికి కాస్త దగ్గరగా రాగలిగింది.

సాయంత్రం వాళ్ళిద్దరూ బయల్దేరి వెళ్తారనగా సత్తెమ్మ మనసులో ఒక ఆలోచన వచ్చింది. రావడమే తడవుగా అలానే చెయ్యాలని వెంటనే ఒక నిశ్చయానికొచ్చింది.

"సీతా! మీ అమ్మను చూసి చానాళ్ళయిందే. చూడాలనుంది.

నేనూ పట్నం వత్తాను." మెల్లగా సీతను అడిగింది.

"అట్టాగేనే పెద్దమ్మా! అమ్మకూడా నిన్ను తీసుకురమ్మని చెప్పింది. నీమీద బెంగగావుందట." సీతమ్మ మాటలకు సత్తెమ్మ ఎంతో పొంగిపోయింది.

సత్తెమ్మను తనతో తీసికెళ్తానని వెంకటయ్యతో అంటే, "అదెందుకే సీతా! ఆ గుడ్డిదొచ్చి మీనెత్తినెక్కాల. మీరొచ్చారుగా. వచ్చినా అది కుదురుగా వుంటదా?" ముందు ఒప్పుకోలేదు.

కాని సీతమ్మ, చెన్నయ్యలు పట్టు పట్టేసరికి కాదనలేక పోయాడు. కొన్నాళ్ళు ఈ రకంగానైనా కొడుక్కి ముసల్దాని బెడద తప్పుతుందని చిన్నమ్మ లోలోన సంతోషపడింది.

ఆరోజే అంతా కలిసి పట్నం చేరుకొన్నారు.

సత్తెమ్మ పట్నం వస్తాననటంలో అసలు సంగతి అక్కడికి వెళ్ళిన తర్వాతగాని బయటపడ్లేదు.

"చెన్నయ్యా! ఇక్కడ పట్నంలో కంటికి ఆపరేసన్ సేత్తారట. నాకు కంటి ఆపరేసన్ సేయించరా నీకు పున్నెం వుంటది. సచ్చి నీ కడుపునబుడతా." నంటూ బ్రతిమిలాడింది సత్తెమ్మ.

"అదికాదత్తా! ఆపరేషనంటే బోల్డు కర్చవుద్ది. ఊరికినే చేసే ఆసుపత్రి ఈడ లేదు." నాన్చాడు చెన్నయ్య.

"డబ్బు సంగతి నాకొదిలేరా." అంటూ బొడ్లోనుండి తళతళ మెరుస్తున్న బంగారు ముక్కుపుడక తీసి చెన్నయ్య చేతిలో పెట్టింది సత్తెమ్మ.

"ఒరే! యిది నా పుట్టింటోల్లు పెట్టింది. గేపకంగా దీన్ని

డాచుకున్నాను. యిదమ్మి వచ్చే డబ్బుతో ఆపరేషన్ సేయించు." అడిగింది సత్తెమ్మ.

చెన్నయ్య అయోమయంలో పడ్డాడు. "అత్తా వెంకటయ్యకు తెలీకుండా యిదంతా చేత్తే నామీదాడు యిరుసుకు పడతాడు. నాకు మాటొత్తది." వెనకాడాడు.

"అది మా అప్ప సొత్తయితే ఆడిదేందిరా, బోడి పెత్తనం. అది దానిట్టం. ఆపరేషను చేయించుకోకుండా గుడ్డిదానిలా ఎంత కాలం పడుండమంటాడు? ఆడేదన్నా అంటే నే సెప్తా వాడిపని. నీకెందుకు నువ్వు కానివ్వు." అంటూ సత్తెమ్మ చెల్లెలు అప్పలమ్మ భరోసాతో చెన్నయ్య ఒప్పుకున్నాడు.

ఆ రోజే బంగారపు కొట్లో ముక్కుపుడక అమ్మేసి సత్తెమ్మ ఆపరేషనుకు ఏర్పాట్లు చేశాడు.

సత్తెమ్మకు కంటి ఆపరేషను చేశారు. ఆ రోజు నుండి సత్తెమ్మ మనసంతా మనవడిమీదే. ఇంటి కెప్పుడెళ్ళి మనవడ్ని చూద్దామా అని ఒకటే ఆరాటం.

"సీతమ్మా! ఇంటి కెప్పుడెల్లిపోవచ్చంటనే. ఈ కట్టులు ఎప్పుడు వూడదీత్తారే?" ఆపరేషన్ చేసిన రెండో రోజే గొడవ మొదలెట్టింది.

"ఎప్పుడెల్లొచ్చునో నాకేటి తెలుత్తదే పెద్దమ్మా! డాక్టరు బాబు ఎంతకాలం వుండాల్నంటె అంతకాలం వుండాల్సిందే. అప్పుడే ఇల్లని గొడవెడితే ఎట్టాగు?" మందలించింది సీతమ్మ.

సత్తెమ్మకు రోజూ రాత్రిళ్ళు కలలొస్తున్నాయి. ఆ కలలలో

మనవడే కనిపిస్తున్నాడు.

కలలో వాడు నడుస్తున్నాడు. సత్తెమ్మకు అందకుండా ఎటో పరిగెడుతున్నాడు. సత్తెమ్మ పట్టుకోవాలని వెంటబడుతుంది. ఎక్కడో పొదల్లో దాక్కుంటే వెదికి వెదికి పట్టుకుంటుంది. చంద్రయ్య దొరికిపోయి దొంగపెడ్తున్నాడు. ఈసారి సత్తెమ్మ ఎక్కడో నక్కుతుంది. వెదికి చివరకు కనిపెట్టి 'దొంగ! దొంగ'! అంటూ చప్పట్లు చరుస్తూ ఎగురుతున్నాడు.

"సెంద్రయ్యా! సెంద్రీ! నా సెంద్రీ!" అంటూ నిద్రలో ఒకటే కలవరింతలు.

పగలంతా మనవడ్ని గురించిన ఊహలతో సత్తెమ్మ మనసు దూదిపింజలా తేలిపోతూంది.

"సెంద్రయ్యా! నీ కోసరం మళ్లీ జన్మెత్తి వత్తన్నారా? నాకు చూపొత్తది." గొణుగుతుంది తనలో తానే.

ఇంతకాలం తనకు చూపు అగపడదని సెంద్రయ్యను తనకు కాకుండా చేత్తన్నారు. తొరలో తనకు చూపొత్తుంది. ఈమాలెవరూ తనని యిడదియ్యలేరు. ఇకనుండి తను బతికినంతకాలం ఆడ్ని తన చేతుల మీదనే పెంచుద్ది.

సెంద్రయ్య నొదిలి చనం వుండదు. పగలంతా ఆడితోనే ఆడుతుంది. రేతిర్లు తనపక్కనే పడుకోబెట్టుకొని ఎన్నో జోల

పాటలు పాడుతుంది. తనచేతులతోనే బువ్వతినిపిత్తది.

ఇంతవాడు అంతయిపోతాడు. మాటలు నేర్పుద్ది. ఎన్నో మంచి కథలు చెప్పుద్ది.

"మా అవ్వ!" అంటూ చనం ఇడిచిపెట్టడు. ఆటల్లో తనే, పాటల్లో తనే, లోకమంతా యిద్దరమే. తన మనవడంటూ గర్వంగా చెప్పుకొంటది.

అడ్ని తనే రోజు బడికి తీసికెల్తుంది. బాగా చదువుకోవా లంటుంది. గొప్పోడివై ఈ అవ్వకు పేరు తేవాలని చెప్తుంది. బాగా చదివి ఆడు నిజంగా సెందురుడై పోతాడు.

కొన్నాళ్ళకు తనింకా ముసలిదై పోతుంది. జబ్బుతో మంచాన పడుతుంది. దేవుడు తనకోసరం వత్తాడు.

"అవ్వా: నువ్వు చచ్చిపోతన్నావా ? నాకు తోడెవరవ్వా? నువ్వు ఎల్లిపోకు." అంటూ తన మంచం మీద కూర్చొని ఏడు త్తాడు. తను ఓదారుత్తుంది.

"నా సెంద్రయ్యా: నే చచ్చిపోయినా అవ్వను మర్చిపోకు. బాగా చదివి గొప్ప ఉద్దోగం సెయ్యాలి." అడి చేతుల్లోనే చచ్చి పోతది. ఆడి ఎలుగులోనే జీవితం ఎలమారిపోద్ది.

'అవ్వా అవ్వా అవ్వా' అంటూ నా కోసరం ఏడుత్తాడు. మా అవ్వ చచ్చిపోయిందని వూరందరికి చెప్తాడు. ఏ పని సేత్తన్నా తలుచుకొంటాడు. తను పైనుండి అడ్ని రోజూ దీవిత్తది.

సెంద్రయ్య పెద్దోడవుతాడు. ఉద్దోగం చేత్తూ చక్కని

ముక్కును మనువాడతాడు. ఆడికి పిల్లలు పుడ్తే, అల్లందరికీ 'మా బంగారు అవ్వ' అంటూ తన పేరులే చెప్తాడు.

ఆడి కొడుకులా పెద్దోళ్లయి మనువాడితే, సెంద్రయ్యా తాతవుతాడు. ఆడి మనవళ్ళకు తన గురించే చెప్తాడు. తను చెప్పిన కథలే చెప్తాడు. తను చచ్చిపోయినా ఈ అవ్వను బతికున్నంత కాలం మరిచిపోడు.

రోజూ సత్తెమ్మ ఆలోచనలన్నీ ఇలానే సాగుతున్నాయి. ఎప్పుడెప్పుడు వూరెల్దామా అని క్షణాలు లెక్కెస్తుంది.

డాక్టర్ కట్లు విప్పదీశాడు. సత్తెమ్మ యిప్పుడు అన్నీ చూడ గలుగుతోంది. నిజమేనా? అని ఆశ్చర్యపోయింది. కాసేపు కళ్ళు మూసుకుని చీకటెలావుంటుందో గుర్తుచేసుకుంది. కళ్ళు తెరిచి వెలుగును చూసి నిజమేననుకొని పసిదానిలా ఆనందపడింది.

“డాక్టర్ బాబూ! నువ్వా దేవుడివే! నా సెంద్రయ్యను చూసు కోటానికి చూపిచ్చినావు. నీ ఋణం తీరదు.” అంటూ చేతులెత్తి దణ్ణం పెట్టింది.

అప్పలమ్మ రేపు వెళ్దువు గానని ఎంతచెప్పినా వినిపించు కోకుండా ఒంటరిగా ఆరోజే వూరికి ప్రయాణమైంది సత్తెమ్మ. చూపొచ్చేసరికి యిప్పుడు వేయి ఏనుగుబలం వచ్చినట్లుగా వుంది.

చెన్నయ్య వచ్చి బస్సు ఎక్కించాడు.

“సెంద్రయ్యా! నీకోసరం మరో జన్మెత్తి వత్తున్నారా! నిన్ను చూసుకొనేందుకే బతికున్నారా!” బస్సులో కూర్చున్నంత

సేపు ఆరాటపడి పోయింది సత్తెమ్మ.

ఊళ్ళో బస్సు దిగి, వీధిలో చకచకా నడిచి వెళుతున్న సత్తెమ్మను ఆశ్చర్యంగా చూశారు. కొందరికి 'సత్తెమ్మేనా?' అని అనుమానంకూడా వేసింది.

సత్తెమ్మ వెళ్ళేసరికి, గుడిసెముందు వెంకటయ్య మోకాళ్ళలో తలదూర్చి, రాయిలా కూర్చొనున్నాడు. అడుగుల చప్పుడుకు తలెత్తి సత్తెమ్మకేసి వెర్రిగా చూశాడు.

"ఏందిరా అట్టా ఓలువు గుడ్డేసుకు చూత్తావు? నేనేరా నీ అమ్మను. నేను చూడగలుగుతున్నానని ఆచ్చెర్యంగా వుందా? నేను ఆపరేషను చేయించుకొన్నారా? నాకు చూపొచ్చింది. ఇంత కాలం నేను గుడ్డిదాన్నని నా సెంద్రుడ్ని దూరం చేసినారు. ఇక ముందాడు నా సెంద్రుడ్రా! ఆడి ఎన్నెల్ని కళ్ళారా చూసుకోవాలనే యింతకాలం పట్నంలో వుండినా. ఏడి నా సెంద్రుడు?" సత్తెమ్మ ధోరణికి వెంకటయ్య పిచ్చివాడిలా చూస్తుండిపోయాడు.

"పిచ్చోడిలా అదేంచూపురా! నీకు తెలీకుండా ఆపరేసన్ చేయించుకున్నానని కోపం వచ్చిందా? ఒరేయ్! అందుకు నీక్కోపం వస్తే, నన్ను తిట్టు, కొట్టు, చంపేసెయ్యి. కానీ పేనం పోయే ముందుగా నా సెంద్రయ్య ఎలుగు నోమాలి చూపి ఆనక నా గొంతు నులుము. ఆనందంగా చత్తాను. ఆడ్ని చూడాలనే యింత బాధపడినాను. చూపెట్టరా నా సెంద్రయ్యని." సత్తెమ్మ మాటలకు పొర్లి పొర్లి ఏడుస్తూ జుట్టు పీక్కున్నాడు వెంకటయ్య.

అంతకుముందే లోపల్నుండి వచ్చిన చిన్నమ్మ బావురుమని ఏడుస్తూ "అత్తా! ఇంకెక్కడి సెంద్రుడు? మసల్ని అన్నాయంచేసి ఎల్లిపోనాడు." కుప్పలా కూలిపోయింది.

"ఓలమ్మో! నా సెంద్రు దెల్లిపోనాడా? ఈ పాపిట్టిదాని కంటబడకుండానే ఎల్లిపోనాడా? ఓరి భగవంతుడా! ఇంత అన్నాయం ఎందుకు చేసినవ్? నా సెంద్రయ్య కేమయిందిరా?" అంటూ గొల్లు మంది సత్తెమ్మ.

"అమ్మా! నువ్వు పట్నం ఎల్లిన రెండోనాడే ఆడికి వాంతులు, యిరోచనాలయాయి. ఊళ్ళో నాటుమందు వయిద్దగం చేయించినాం. రెండు రోజులయినా తగ్గలేదే! చివరికి యీడొల్లకాదని పట్నం తీసికెళ్ళాలన్నారు. రేతిరే ఆడికి పేనంమీద కొచ్చినాది. పట్నం తీసుకెళ్ళటానికి చేతిలో చిల్లిగవ్వలేదు. నీ ముక్కుపుడక సంగతి గుర్తొచ్చి పెట్టంతా ఎతికినాం. అది కనపడ్నేదు. డబ్బులేని పేదలింట్లో ఎలుగు ఎట్టానిలుచుద్దే. ఆడు ఆరేతిరే చచ్చిపోనాడు. నీకు కబురెట్టడానికికూడా మనసొప్పలేదే! నీ కాపరేసన్ చేయించి నారని ఆరోజే చెన్నయ్య ఉత్తరం ముక్కరానేసిండు. నీకుచెప్పి లాభవేటని ఆడ్ని పూడ్చేసినాం." ముఖాన్ని చేతుల్లోదాచుకొని బావురుమన్నాడు వెంకటయ్య.

సత్తెమ్మ పిచ్చిదానిలా జుట్టు పీక్కుంది "ఒరే! నా సెంద్రుడ్ని నేనే పొట్టనెట్టుకున్నారా. నా సెంద్రుడ్ని కళ్ళారా చూసు కోవాలనే ముక్కుపుడకమ్మి ఆ డబ్బెట్టి ఆపరేసన్ చేయించు

కున్నారా? కొండంత ఆశతో ఆడ్ని చూడాలనొత్తే ఆదేలేకుండా పొయ్యినాడు. ఆడ్ని చూడాలన్న నా కోరికే ఆడ్ని పొట్టనెట్టుకుంది. లేకుంటే ఆడు బతికేవోడు. మనందరి ఎలుగు ఆడితోనే ఎల్లి పోయింది. ఆడి ఎలుగు చూడలేని ఈ కళ్ళు నాకింకా ఎందుకురా? ఆదే లేకపోయినాక ఈ చూపెందుకు?" సత్తెమ్మ గోలుగోలున ఏడుస్తూ, చేతివేళ్ళతో కళ్ళను పొడుచుకుంటూ కుప్పకూలిపోయింది.

(ఆదివారం, 10 మే, 1981)